సాక్షి ఖమ్మం

సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



వెన్నుపోటుదారుడెవరో తెలుసు

గత ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిని ఓడించి పార్టీకి వెన్నుపోటు పొడిచింది ఎవరో అందరికీ తెలుసని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. 8లో



అందుబాటులో ఆధునిక వైద్యం

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో త్వరలోనే అత్యాధునిక వైద్యసేవలు ప్రారంభం కానున్నాయి. కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందనుంది. 10లో

గరిష్టం / కనిష్టం
35° / 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రత తక్కువగానే నమోదువుతుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న 'నలజాల'



ఆలయంలో అర్చకులతో నలజాల సత్యనారాయణ దంపతులు

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని రాష్ట్ర పురపాలక అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్ నలజాల సత్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రధానార్చకులు సీతారామానుజాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బూర్లె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్



కొర్లగూడెంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మధుసూదన్

కల్లూరు రూరల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్నే తీసుకురావాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ రైతులను కోరారు. మండల పరిధిలోని పుల్లయ్యబంజరు, కొర్లగూడెంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీఓ విద్యాచందనతో కలిసి ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొస్తే ప్రభుత్వం మంచి ధర ఇస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గన్నీ బస్తాలు, రవాణా లారీలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏడీఏ నర్సింహారావు, ఏఓ రూప, ఐకేపీ ఏపీఎం రామారావు, రైతు ప్రతినిధులు మల్లేశ్వరరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకనకదుర్గమ్మ తల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల సందడి

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేలంపాట గడువు ముగిసినా..

పెద్దమ్మతల్లి ఆలయంలో చీరల వేలంపాట గడువు ఈ నెల 3వ తేదీన ముగిసినా.. వ్యాపారి నిబంధనలకు విరుద్ధంగా ఆలయం వద్ద ఆదివారం చీరలను భక్తులను విక్రయించారు. దీంతో అధికారులు అడ్డుకున్నారు.

నిరసనలకు శ్రీకారం

నేడు ఖమ్మంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

- కార్నర్ మీటింగ్‌లో మాట్లాడనున్న రేవంత్‌రెడ్డి
- నిరుద్యోగులు భారీగా హాజరుకావాలని నేతల పిలుపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన డీసీసీ



నిరసన ర్యాలీని విజయవంతం చేయాలంటూ మధిరలో ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజల సమస్యలపై మరింత గట్టిగా గళం వినిపించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఇటీవల చోటు చేసుకున్న టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పేపర్ లీకేజీల వ్యవహారంపై పోరుబాట పట్టింది. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ నిరసన దీక్షలు చేపట్టాలని నిర్ణయించగా.. మొదట ఖమ్మంలో సోమవారం నిరుద్యోగ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 4గంటలకు టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ జెడ్పీ సెంటర్ మీదుగా పాత బస్టాండ్ వరకు సాగుతుంది. పాత బస్టాండ్ సమీపంలో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించనున్నారు. ఆయనతో పాటు పలువురు సీనియర్ నాయకులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

ర్యాలీ, మీటింగ్‌కు సర్వం సిద్ధం..

నిరుద్యోగ నిరసన ర్యాలీ, మీటింగ్ కోసం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ నిరసన దీక్షలను నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయించగా.. ఈనెల 21న నిర్వహించాల్సిన నల్లగొండ జిల్లా దీక్ష అనివార్య కారణాలతో వాయిదా పడింది. దీంతో ఖమ్మంలో నిర్వహించే ఈ నిరసన ర్యాలీ మొదటి కార్యక్రమం కానుంది. ఈ ర్యాలీ, మీటింగ్ విజయవంతం చేయాలని పార్టీ మండల కమిటీలకు ఇప్పటికే డీసీసీ పిలుపునిచ్చింది. నిరసన ర్యాలీకి నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని కాంగ్రెస్ శ్రేణులకు బాధ్యతలు అప్పగించారు. విద్యార్థి, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నిరుద్యోగులు భారీగా తరలిరావాలని కోరారు. విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేద్దామని.. కలిసి రావాలని నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేశారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు ఈ సమావేశాల్లో మాట్లాడి వివరాలు వెల్లడించారు.

కలిసికట్టుగా పోరాడేలా..

ఎన్నికల నేపథ్యంలో కేడర్‌లో ఉత్తేజం నింపేందుకు టీపీసీసీ నిరంతరం ప్రజల్లో ఉండేలా కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఈ క్రమంలో ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన పేపర్ లీకేజీలపై పోరాటానికి పూనుకుంది. టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పేపర్ లీకేజీలు, ఉద్యోగ నియామకాల్లో నిర్లక్ష్యం, విద్యార్థి వ్యతిరేక విధానాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం వంటి అంశాలను నిరుద్యోగుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా నేతలు ప్రణాళిక రూపొందించారు. ఖమ్మంలో నేడు నిర్వహించే కార్యక్రమం విజయవంతం చేయడం ద్వారా మిగిలిన జిల్లాల్లో నూతనోత్తేజం తీసుకురావాలనే తలంపుతో పార్టీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో వర్గాలకు అతీతంగా ఏక తాటిపై తెచ్చి సభను సక్సెస్ చేసేందుకు డీసీసీ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాయకుల మధ్య సమన్వయం పెంపొందించి అందరూ కలిసికట్టుగా ప్రజా, నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందనే ఆలోచనలో అధిష్టానం ఉంది.

ఖమ్మానికి మూడోసారి రేవంత్..

టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్‌రెడ్డి మూడోసారి ఖమ్మం రానున్నారు. గతంలో వరంగల్‌లో రాహుల్‌గాంధీ పాల్గొనే బహిరంగ సభ విజయవంతం కోసం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కామేపల్లి మండలంలో ఆయన పాదయాత్ర జరిగింది. ఇప్పుడు మూడోసారి సోమవారం ఖమ్మంలో నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీకి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి మయూరిసెంటర్ వరకు నిర్వహించే ర్యాలీలో పాల్గొనడంతోపాటు అక్కడే ఏర్పాటు చేసే కార్నర్ మీటింగ్‌లో నిరుద్యోగులనుద్దేశించి మాట్లాడనున్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు అండగా ఉంటుందనే సందేశాన్ని ఇవ్వనున్నారు. మీటింగ్ అనంతరం ఆయన తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారు.

జిల్లాకు నేడు హరీష్‌రావు

- కల్లూరులో పర్యటించనున్న మంత్రి
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య తదితరులు

సత్తుపల్లి: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు జిల్లా పర్యటన ఖరారైంది. సోమవారం ఉదయం 8.45 గంటలకు హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10 గంటలకు కల్లూరు మండలం లక్ష్మీతండా ఫ్రూట్ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి మోటార్‌సైకిల్ ర్యాలీగా 10.10 గంటలకు కల్లూరుకు చేరుకుని రూ.7.5 కోట్లతో నిర్మించనున్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి, అనంతరం రూ.2.9 కోట్లతో నిర్మించే జలవనరుల సర్కిల్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11 గంటలకు కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మధ్యాహ్న భోజనం చేస్తారు. 2.30 గంటలకు రూ.7.5 కోట్లతో నిర్మిస్తున్న పెనుబల్లి 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనానికి శంకుస్థాపన చేస్తారు. 3.20 గంటలకు తిరిగి హెలిప్యాడ్‌కు చేరుకుని హైదరాబాద్ వెళతారు. మంత్రి హరీష్‌రావు పర్యటనలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు తదితరులు పాల్గొంటారు.

తెలుగు సులభంగా నేర్చుకునేలా కార్యాచరణ

డీఈఓ సోమశేఖర శర్మ




మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖర శర్మ

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు తెలుగు భాషను సులభంగా నేర్చుకునే వీలుందని డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు. కొణిజర్ల మండలం బస్వాపురం ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు చంద్రగిరి వెంకటేశ్వర్లు ప్రసిద్ధ తెలుగు భాషా సాహితీవేత్తలచే రూపొందించిన తెలుగు లిపి – సరికొత్త ఆలోచన కార్యక్రమాన్ని నగరంలోని న్యూఇరా పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేయగా.. డీఈఓ హాజరై మాట్లాడారు. తెలుగు భాషను నేర్చుకునే క్రమంలో ద్విత్వాక్షరాలు, సంయుక్త అక్షరాలు విద్యార్థులను అయోమయానికి గురి చేస్తున్నాయని, మహాప్రాణాక్షరాల్లో కూడా పొంతన లేని ఆకారాలు ఉన్నాయని, ఇలాంటివేమీ లేకుండా భాషను సంస్కరించే దిశలో ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం అభినందనీయని అన్నారు. కార్యక్రమంలో కవి, విమర్శకులు డాక్టర్ సీతారాం, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్, ఏఎంఓ రవికుమార్, సీఎంఓ రాజశేఖర్, న్యూఇరా పాఠశాల కరస్పాండెంట్ ఐ.వి. రమణారావు, డైరెక్టర్ భూమేష్, హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్టీ చర్యలను ప్రతిఘటించండి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి



సమావేశంలో మాట్లాడుతున్న చావా రవి

సత్తుపల్లిరూరల్: ఎన్‌సీఈఆర్టీ సిలబస్ నుంచి జీవ పరిణామ క్రమం, పునరుత్పత్తి పాఠ్యాంశాలను తొలగించాలనే నిర్ణయాన్ని ప్రజాస్వామిక వాదులు, విజ్ఞానవేత్తలు తీవ్రంగా ప్రతిఘటించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి కోరారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ విజ్ఞానానికి మతశక్తులు తూట్లు పొడుస్తున్నాయని ఆరోపించారు. శాస్త్రీయ విజ్ఞానం పెరిగేలా నూతన విద్యావిధానంలో పాఠ్యాంశాలను పెంచాలని కోరారు. తెలంగాణలో పదోన్నతులు, బదిలీలను వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా మహిళా కార్యదర్శి నిర్మలాకుమారి, ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరెడ్డి, రమేష్, మురళీమోహన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణపుష్పార్చన



కల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి సేవల్లో పాల్గొన్నారు. కాగా, స్వామివారిని ఇటీవల బదిలీ అయిన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలను అందచేశారు. ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబు పాల్గొన్నారు.

పగబట్టిన ప్రకృతి



గువ్వలగూడెంలో వరదకు కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కాపాడుకుంటున్న రైతులు



నాచేపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన బస్తాలు



చింతకాని మండలం లచ్చగూడెంలో మొక్కజొన్నపై కప్పిన పట్టాలపై నిలిచిన నీరు

- జీభత్సం సృష్టించిన ఈదురుగాలులు, వడగళ్ల వాన
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో రైతుల ఇక్కట్లు
- కోత దశలో ఉన్న వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం

ఖమ్మంవ్యవసాయం/నేలకొండపల్లి/ముదిగొండ : పంటలపై ప్రకృతి విలయతాండవం చేస్తోంది. చేతికందే సమయంలో ఈదురుగాలులు, అకాల వర్షాలు, వడగళ్ల వానలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. జిల్లాలో మూడు రోజులుగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో అకాల వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల వడగళ్లు కూడా పడ్డాయి. ఆదివారం సాయంత్రం జిల్లాలోని పలుచోట్ల భారీ వర్షం కురిసింది. 20 మి.మీ. సైజులో వడగళ్లు పడ్డాయి. ఈ యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలు ప్రస్తుతం చేతికందే దశలో ఉన్నాయి. పలుచోట్ల కోతలు పూర్తయి ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టగా, కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలకు తరలించారు. మొక్కజొన్న పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇక జిల్లాలో 30 వేల ఎకరాల్లో సాగు చేసిన మామిడి కాయలు ఈదురుగాలులతో పూర్తిగా నేలరాలాయి.

టార్పాలిన్లు లేక ఇక్కట్లు..

ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, కామేపల్లి, కారేపల్లి, కొణిజర్ల, వైరా, చింతకాని, బోనకల్, ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి తదితర మండలాల్లో ఆదివారం ఈదురుగాలులు, వడగళ్ల వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. టార్పాలిన్లు లేక ఇబ్బందుల పాలయ్యారు. ప్రభుత్వం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ఎక్కడా కొనుగోళ్లు మొదలు కాలేదు. ఆయా కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కూడా లేవు. దీంతో రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం వరద పాలైంది. తమ ఆరుగాలం శ్రమ నీట మునగడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కూలిన స్తంభాలు.. ఎగిరిపోయిన రేకులు

జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో అకాల వర్షం, ఈదురుగాలులతో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో అనేక గ్రామాలు ఆదివారం రాత్రంతా అంధకారంలోనే ఉన్నాయి. ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయి పలువురు నిరాశ్రయులయ్యారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో ఓ మహిళా రైతు వానలోనే ధాన్యం పోగు చేస్తుండగా వడగండ్లు పడి తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.



నేలకొండపల్లి తడిసిన ధాన్యం వద్ద దీనంగా కూర్చున్న మహిళా రైతు

ఆరు నెలలు బేఫికర్..

జిల్లాకు చేరిన స్టాంప్ పేపర్లు

- ఉమ్మడి జిల్లాలోని 11 కార్యాలయాలకు పంపిణీ
- రూ.20, రూ.50, రూ.100 డినామినేషన్లలో లభ్యం
- ఇన్నాళ్లూ అధిక ధర వెచ్చించలేక వినియోగదారుల ఇక్కట్లు



ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత తీరింది. గత రెండు నెలలుగా స్టాంపుల కోసం వినియోగదారులు నానా అవస్థలు పడ్డారు. రూ.100 స్టాంప్ కొనుగోలు చేయాలంటే రూ.200 వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.6.40 కోట్ల విలువైన స్టాంప్ పేపర్లు చేరడంతో వారి ఇబ్బందులు తొలగనున్నాయి. ప్రస్తుతం వచ్చిన స్టాంప్ పేపర్లు ఆరు నెలల పాటు సరిపోతాయని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారి తెలిపారు.

కృత్రిమ కొరత సృష్టించి..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు వీటి పరిధిలో 150 మంది వెండర్లు స్టాంప్ పేపర్లను విక్రయిస్తుంటారు. అయితే మూడు నెలలుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్టాంప్ పేపర్ల నిల్వలు తగ్గడంతో కొరత ఏర్పడింది. ఇదే అదనుగా స్టాంప్ వెండర్లు బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయించడం మొదలుపెట్టారు. నేలకొండపల్లి మండలంలోని ఓ వెండర్ రూ.100 స్టాంప్ పేపర్‌ను రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయించినట్లు సమాచారం. ఇలాగే జిల్లా వ్యాప్తంగా స్టాంప్ వెండర్లు ఇష్టానుసారంగా రేట్లు పెంచి విక్రయాలు జరిపినట్లు తెలిసింది. ఈ క్రమంలో స్టాంప్ పేపర్లు అవసరమైన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్తే రూ.100 స్టాంప్ పేపర్ అదే ధరకు లభిస్తున్నా... గ్రామాల్లో ఉన్న వారు అంతదూరం వెళ్లలేక స్థానిక వెండర్లను సంప్రదిస్తే దోపిడీకి పాల్పడినట్లు తెలిసింది.

నాసిక్ నుంచి జిల్లాకు..

కరోనా కాలం నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు స్టాంప్ పేపర్ల సరఫరా తక్కువగా జరిగింది. గత ఏడాది ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వచ్చిన స్టాంప్ పేపర్లను ఇన్నాళ్లు వినియోగించారు. ఇటీవల పేపర్ల నిల్వలు తగ్గడంతో జిల్లా యంత్రాంగం ఆ శాఖ ఉన్నతాధికారులకు నివేదించింది. దీంతో కనీసం ఆరు నెలలకు సరిపడా రూ.6.40కోట్ల విలువైన స్టాంప్ పేపర్లను పంపించారు. నాసిక్‌లో తయారైన ఈ స్టాంప్ పేపర్లు నేరుగా గత గురువారం జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయానికి చేరుకోగా.. ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, స్టాంప్ వెండర్లకు చేరవేస్తున్నారు.

ఎక్కువ ధరకు అమ్మితే లైసెన్స్ రద్దు



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్టాంప్ పేపర్ల కొరత లేదు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు వస్తే విచారణ చేసి వెండర్ లైసెన్స్ కూడా రద్దు చేస్తాం. జిల్లాకు ప్రస్తుతం వచ్చిన స్టాంప్ పేపర్లు ఆరు నెలల పాటు సరిపోతాయి.

– చిట్టిమళ్ల అశోక్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

రూ.6.40 కోట్లు.. 10 లక్షలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి 10 లక్షల స్టాంప్ పేపర్లు చేరాయి. వీటిల్లో రూ.20 విలువైనవి రెండు లక్షల స్టాంప్ పేపర్లు ఉండగా.. రూ.50 విలువైనవి నాలుగు లక్షలు ఉన్నాయి. అలాగే రూ.100 విలువైనవి 4 లక్షల స్టాంప్ పేపర్లు వచ్చాయి. వీటి విలువ రూ.6.40 కోట్లుగా ఉంది. ఇక న్యాయపరమైన ప్రక్రియలకు అవసరమయ్యే సుమారు రూ.75 లక్షల విలువైన రూ.5, రూ.10 డినామినేషన్లతో స్టాంప్‌లు రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్నాయి.

క్లుప్తంగా

త్వరలో 'దేశ్‌కి నేత కేసీఆర్' షూటింగ్



మాట్లాడుతున్న జానీపాషా

ఖమ్మంమామిళ్లగూడెం: ఈ నెల చివరి వారంలో 'దేశ్ కి నేత కేసీఆర్' షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌ను ఖమ్మంలో మంత్రి అజయ్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభించనున్నామని దర్శక, నిర్మాత షేక్ జానీపాషా తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు.. జాతీయ రాజకీయాలలో ఆయన వేయబోయే అడుగు.. తదితర అంశాలపై షార్ట్ ఫిల్మ్ ఉంటుందని, ఖమ్మంలో 29 శాతం హైదరాబాద్‌లో మిగిలిన షూటింగ్ చేసి.. అన్ని థియేటర్లలో విడుదల చేస్తామని చెప్పారు. సీనియర్ నటులు షేక్ లాల్‌జాన్‌పాషా, శోభన్, కోటయ్య, శారద, నటీనటులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఎంపీ నామా పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. కల్లూరు మండలంలో ప్రారంభించే అభివృద్ధి పనుల కార్యక్రమంలో మంత్రులు తన్నీరు హరీష్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌లతో కలిసి పాల్గొంటారు. అనంతరం జిల్లాలో పలు కార్యక్రమాలకు హాజరు కానున్నారని క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లి వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మేడేపల్లి శ్రీనివాసాచారి గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సమీపంలో శ్రీనివాసాచారి బైక్‌పై యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న కారు ఢీకొనటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై బీరు సీసాతో దాడి

సత్తుపల్లిటౌన్: డబ్బుల లావాదేవీల విషయంలో ఘర్షణ జరిగి ఓ వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎస్.మహేశ్, గంగారం గ్రామానికి చెందిన పులిజాల సతీశ్‌లు డబ్బుల లావాదేవీల విషయమై ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో సతీశ్‌పై మహేశ్ బీరు సీసాతో దాడి చేశాడు. బాధితుడు ఆదివారం సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ

మధిర: మండలంలోని మాటూరు క్రాస్ రోడ్డు సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఇరువురు వ్యక్తులకు గాయాలయ్యాయి. మధిర నుంచి ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన మోదుగు ముత్తయ్య మోటార్ సైకిల్‌పై వెళుతుండగా రాజవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మరో మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఓవర్ టేక్ చేసే క్రమంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన మోదుగు ముత్తయ్యను మధిర సివిల్ ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనూతల గ్రామానికి చెందిన సొందే చిన్నవీరయ్య (50) మద్యం మత్తులో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిన్నవీరయ్య ప్రతి రోజూ మద్యం తాగి ఇంటికొచ్చేవాడు. కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు చెప్పినా మద్యం మానలేదు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో తాగిన మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే చిన్నవీరయ్య మృతిచెందాడు. మృతుడి కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో మరొకరు..

సింగరేణి(కొత్తగూడెం): కుటుంబ కలహాలతో మిషన్ కూలీగా పనిచేసే మేకల సారయ్య (40) త్రీ ఇంక్లయిన్ పంచాయతీ కార్యాలయం పక్కన గల వాటర్ ప్లాంట్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం టూటౌన్ పరిధిలో వెలుగుచూసింది. తొర్రూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన సారయ్య నాలుగేళ్ల కిందట త్రీఇంక్లయిన్ ప్రాంతంలో నివాసముంటున్నాడు. అప్పుడప్పుడూ భార్యతో గొడవపడి సొంతూరు వెళ్లివస్తుంటారు. ఈనెల 13న భార్యతో గొడవ పడి సొంతూరుకు వెళ్లి ఈ నెల 22న త్రీ ఇంక్లయిన్‌కు చేరుకున్నారు. ఇంటికి వెళ్లకుండా వాటర్ ప్లాంట్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారుణ్యంలో మ్యాచ్ ఫిక్సింగ్!

దళారులకు చేరుతున్న రహస్య సమాచారం

- కార్మికులతో 'డీల్'పై దళారుల మాటామంతీ
- మాటలు కలిసి.. మూట ముట్టచెబితే రాచబాట
- సింగరేణి మెడికల్ బోర్డుపై అనుమానాల వెల్లువ



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇండియన్ క్రికెట్‌లో ఒకప్పటి ఆల్‌రౌండర్ మనోజ్ ప్రభాకర్ ఆటలో గుట్టుగా సాగుతున్న బెట్టింగ్ మాఫియా వివరాలను తొలిసారి బట్టబయలు చేశాడు. అప్పటి నుంచి క్రికెట్‌లో బెట్టింగ్ దందాను అరికట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. తాజా ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)పైనా బెట్టింగ్ రాయుళ్ల నీడ పడింది. ఇదే తరహాలో సింగరేణి సంస్థ కారుణ్య నియామకాల కోసం చేపడుతున్న మెడికల్ బోర్డులోనూ అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. కారుణ్య నియామకాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని బ్యాక్ డోర్ గుండా దళారులకు చేరుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమాచారం, తదనుగుణంగా జరిగే మాటమంతీ ఆధారంగా కారుణ్య నియామకాల తుది ఫలితాలు ముందుగానే డిసైడ్ అవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెల్లుతున్నాయి. దీని కోసం మెడికల్ బోర్డుకు అనుబంధంగా పని చేసే విభాగాల్లోని కొందరు వ్యక్తులు క్రికెట్ బుకీల తరహాలో అడ్డగోలు వ్యవహారాలకు కేంద్ర బిందువుగా మారారు.

మెడికల్ బోర్డు

వివిధ ఏరియాల్లో పని చేస్తున్న కార్మికులకు అనారోగ్య సమస్యలు ఎదురై గనుల్లో పని చేయలేని పరిస్థితి ఎదురైతే ఆ విషయాన్ని గనుల్లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారు. అక్కడ సదరు కార్మికుడు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, తీవ్రత, ఒక వేళ పని నుంచి తొలగిపోవాల్సి వస్తే తదనంతరం సంస్థలో ఎవరికి ఉద్యోగం కల్పించాలనే వివరాలతో కూడిన ఫైల్ రూపొందిస్తారు. ఇలా వివిధ ఏరియాల్లో అనారోగ్య కారణాలతో పదవీ విరమణ కోరుతున్న కార్మికుల ఫైళ్లని సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయం, కొత్తగూడెం చేరుకుంటాయి. వచ్చిన ఫైళ్లు, అందులో కార్మికుల అనారోగ్య సమస్యల వివరాలను ఇక్కడ మదింపు చేస్తారు. ఆ తర్వాత సదరు కార్మికుల అనారోగ్యాన్ని పరిశీలించి నివేదిక ఇచ్చే బాధ్యతను సంస్థ ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డు చూసుకుంటుంది.

డేటా లీకేజీ

కారుణ్య నియామకాల కోసం మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను మదింపు చేసే క్రమంలో సదరు కార్మికుల అనారోగ్య సమస్య, తీవ్రత, వాటి ఆధారంగా వారి వారసులకు ఉద్యోగం వచ్చే అవకాశం ఎంత వరకు ఉంది తదితర వివరాలను దళారులకు చేరిపోతోంది. ఈ విషయం తెలుసుకున్న దళారులు వెంటనే కార్మికుడి దగ్గర ప్రత్యక్షమవుతున్నారు. 'మెడికల్ బోర్డులో వ్యవహారం చాలా కఠినంగా ఉంటుంది', 'నీకు ఉన్న సమస్యకు అన్‌ఫిట్ అవడం కష్టం. కాబట్టి సమస్య తీవ్రతను పెంచి పని జరిగేలా చూస్తాం', మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ చేయాలంటే ఫార్మాలిటీస్ చూసుకోవాలి, లేదంటే ఫైల్ సజావుగా ముందుకు కదలదు' అంటూ బేరాలు మొదలు పెడతారు.

పారదర్శకతపై నీలినీడలు

అనారోగ్య సమస్య తీవ్రంగా ఉండి కచ్చితంగా అన్‌ఫిట్ చేయాల్సి వస్తే ఫార్మాలిటీస్‌కు ఒక రేటు, అన్‌ఫిట్ కండీషన్స్‌కు కాస్త అటు ఇటుగా ఉండే ఫార్మాలిటీస్ రేటు అన్నట్టుగా ధరలు చెప్పేస్తారు. దీనికి తగ్గట్టుగా కారుణ్య నియామకాలకు సంబంధించి మాటామంతీ జరిపిన కార్మికుల్లో ఎంత మంది తమ మాయలో పడ్డారు ? ఎవరు మాయమాటలకు లొంగకుండా రూల్ ప్రకారం వెళ్తామన్నారనే వివరాల్లో స్పష్టత వచ్చేస్తోంది. వీటి ఆధారంగా మెడికల్ బోర్డుకు అనుబంధంగా అక్రమాలకు చక్రం తిప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫలితంగా మెడికల్ బోర్డు ద్వారా జరిగే నియామకాలపై క్రమం తప్పకుండా అవినీతి ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. మరోవైపు డబ్బులు పోయినా తమ వాళ్లకు ఉద్యోగం వస్తే చాలనే భావన కార్మికుల్లో నెలకొంది.

అక్రమాలకు కేరాఫ్..

దక్షిణ భారత దేశంలోనే ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉన్న సింగరేణి తెలంగాణలో ఆరు జిల్లాలతో పాటు ఒడిశాలో బొగ్గు ఉత్పత్తికి రంగం సిద్ధం చేస్తోంది. ఆరు జిల్లాల పరిధిలో సింగరేణికి గనులు ఉన్నాయి. ఇందులో సుమారు నలభై నాలుగు వేల మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. ఎవరైనా కార్మికుడు తన రిటైర్‌మెంట్ సమయానికి రెండేళ్ల ముందు అనారోగ్య కారణాలతో విధుల నుంచి తొలగాల్సి వస్తే వారి వారసుడు కంపెనీలో ఉద్యోగం పొందే వీలుంది. వీటిని కారుణ్య నియామకాలుగా పరిగణిస్తారు. కార్మికులు, వారి కుటుంబాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ కారుణ్య నియామకాలు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.

రేపు ఖమ్మంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

భారీగా తరలిరావాలని మంత్రి పువ్వాడ పిలుపు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలు, నాయకుల్లో భరోసా నింపేందుకు నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలు ముగింపు దశకు చేరుకున్నాయి. నగరంలోని పలు డివిజన్లలో ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేయగా, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈనెల 27 లోపు అన్ని ప్రాంతాల్లో ఆత్మీయ సమ్మేళనాలు ముగించాలని పార్టీ నిర్ణయించడంతో 25న ఖమ్మం నగరంలోని మమత కళాశాల గ్రౌండ్‌లో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆరోజు ఉదయం 8 గంటల వరకు అన్ని డివిజన్‌లలో పార్టీ జెండాలు ఆవిష్కరించాలని, 9 గంటలకు మమత ఆస్పత్రి గ్రౌండ్‌లో జరిగే సభకు నియోజకవర్గ ప్రజలు హాజరు కావాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. కార్యకర్తలకు భరోసా ఇవ్వడానికే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి పువ్వాడ తెలిపారు. 25న జరిగే ఖమ్మం సభకు ప్రతి బీఆర్‌ఎస్ సభ్యుడు కుటుంబ సమేతంగా తరలిరావాలన్నారు. పార్టీ అధినేత సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ సమ్మేళనం ద్వారా రానున్న ఎన్నికలకు కార్యకర్తలను సమాయత్తం చేయడంతోపాటు ప్రజా సంక్షేమం, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసేలా దిశానిర్దేశం చేయనున్నట్లు మంత్రి పువ్వాడ ఓ ప్రకటనలో వెల్లడించారు.

వెన్నుపోటుదారుడు ఎవరో ప్రజలకు తెలుసు..



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజ్

జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

ఎర్రుపాలెం: టీఆర్‌ఎస్ అభ్యర్థిని కాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించి పార్టీకి నిజంగా వెన్నుపోటు పొడిచినోళ్లు ఎవరనేది యావత్తు తెలంగాణ ప్రజలకు తెలుసని పరోక్షంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ విమర్శించారు. ఆదివారం మండలంలోని మీనవోలు గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు పార్టీకి రాజీనామా చేయాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోందని, పార్టీ గుర్తుతో గెలిచిన వారు దమ్ముంటే తమ పదవులకు రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. అయిలూరి వెంకటేశ్వరరెడ్డి డీసీసీబీ డైరెక్టర్ ఎలా అయ్యారో అందరికీ తెలిసిందేనన్నారు. కులాలు, మతాల వారీగా ప్రజలు ఓట్లేయేడం లేదని, గత అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణమాదిగ, మోత్కుపల్లి నర్సింహులు, సగ్గుర్తి విజయవాణికి వచ్చిన ఓట్లే ఉదాహరణ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భట్టి విక్రమార్క హయాంలో చేసిన అభివృద్ధి శూన్యమని చెప్పారు. 25న అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించాలని కోరారు. సమావేశంలో చావా రామకృష్ణ, దేవరకొండ శిరీష, కుడుముల మల్లికార్జున్‌రెడ్డి, పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, వేమిరెడ్డి బాలరాఘవరెడ్డి, శ్రీను, అప్పారావు, కృష్ణారెడ్డి, సాంబశివరావు, శ్రీనివాసరావు, మధుసూదన్‌రెడ్డి, స్టాలిన్, చిట్టిబాబు, రవి, శిరీష, పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

చింతకాని: ఈ నెల 25వ తేదీన మధిరలోని రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ కోరారు. మండలంలోని లచ్చగూడెం గ్రామంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కోపూరి పూర్ణయ్య, గురిజాల హనుమంతురావు, రమేశ్, రత్నాకర్, పుల్లయ్య, వెంకట్రామయ్య, శ్రీను, నర్సయ్య, తిరపయ్య, కృష్ణయ్య, సీతయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆటలు

- నేటి నిరుద్యోగ నిరసన ర్యాలీని జయప్రదం చేయండి
- మాజీ మంత్రి సంభాని, మాజీ ఎంపీ వీహెచ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సంభాని, పక్కన వీహెచ్ తదితరులు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్రంలో పేపర్ లీకేజీలతో విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటలాడుకుంటున్నాయని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సంభాని చంద్రశేఖర్, మాజీ ఎంపీ వి.హన్మంతరావు మండిపడ్డారు. పేపర్ లీకేజీలకు పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన నగరంలో నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని వారు కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 24 సాయంత్రం 4.30 గంటలకు నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ నుంచి పాత బస్టాండ్ వరకు నిరుద్యోగ నిరసన ర్యాలీ నిర్వహించనున్నామని, కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇంటికో ఉద్యోగమిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కెసీఆర్ తొమ్మిదేళ్ల కాలంలో ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయకుండా కాలం వెళ్లదీశారన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలని మోసం చేసిన నరేంద్రమోదీ నియంత పాలనకు వ్యతిరేకంగా యువతను చైతన్య పరిచేందుకు నిరసన ర్యాలీ చేపట్టామని చెప్పారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ రాజకీయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ అవినీతిపై ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, టీపీసీసీ సెక్రటరీలు రాపోలు జయప్రకాష్, కొండేటి మల్లయ్య, నర్సింహారెడ్డి, బాలునాయక్, ఆవుల రాజిరెడ్డి, వెన్నం శ్రీకాంత్‌రెడ్డితోపాటు నారాయణరావు, రాయల నాగేశ్వరరావు, మహ్మద్ జావీద్, పుచ్చకాయల వీరభద్రం, కిరణ్, సీతారాములు, నాగేశ్వరరావు, బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సత్తుపల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా బెల్లం శ్రీనివాస్‌ను నియమించగా ఆయన్ను సంభాని చంద్రశేఖర్ సన్మానించారు.

సంచులు తారుమారు..

32 తులాల బంగారం బాధితురాలికి అప్పగింత



బంగారు నగలు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

ఖమ్మంక్రైం: రైలులో ఇద్దరు ప్రయాణికులకు సంబంధించిన సంచులు మారాయి. ఓ బ్యాగ్‌లో 32 తులాల బంగారం ఉండటంతో దానిని జీఆర్‌పీ పోలీసులు ఆదివారం బాధితురాలికి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్‌కు చెందిన నాగమణి విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లటానికి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరింది. మధిరకు చెందిన రామాచారి ఖమ్మానికి తన బ్యాగ్‌తో బయలుదేరాడు. వీరిద్దరు ఒకే కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేస్తున్నారు. ఖమ్మం రావటంతో రామాచారి తన బ్యాగ్ మర్చిపోయి దిగిపోయాడు. తిరిగి బ్యాగ్ గుర్తుకు రావటంతో వెంటనే మహబూబాద్‌లో ఉన్న తన స్నేహితుడు రాంబాబుకు ఫోన్‌చేసి చెప్పాడు. రాంబాబు మహబూబాబాద్లో రైలు ఎక్కి నాగమణికి చెందిన బ్యాగ్ రామాచారిది అనుకొని తీసుకొని దిగాడు. రామాచారి ఫోన్ చేసి బ్యాగ్‌ను చూడమని చెప్పగా రాంబాబు బ్యాగ్‌ను తీసి చూసాడు. బ్యాగ్‌లో బంగారు నగలు ఉన్నాయని చెప్పాడు. దీంతో రామాచారి అది తన బ్యాగ్ కాదని చెప్పటంతో రాంబాబు ఆ బ్యాగ్‌ను ఖమ్మం తీసుకొని రాగా జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించారు. ఈలోపు తన బ్యాగ్ మారిందని తెలుసుకొని నాగమణి ఖాజీపేటలో దిగి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే వారు ఖమ్మానికి సమాచారం అందించగా ఇక్కడ ఆ బ్యాగ్ ఉందని తెలిపారు. దీంతో నాగమణి ఖమ్మం రాగా ఆమె బంగారు నగలు ఉన్న బ్యాగ్‌ను అప్పగించారు. రాంబాబు, రామాచారిలను అభినందించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, జీఆర్‌పీ ఎస్ఐలు శ్రీకాంత్, భాస్కర్‌రావు, పరుశురాం, హెడ్ కానిస్టేబుళ్లు సత్యనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, మహిళా కానిస్టేబుల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న లాయర్లు

ఖమ్మంలీగల్: న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌కు ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యుడు తాళ్లూరి దిలీప్‌చౌదరి వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో వినోద్‌కుమార్‌ను కలిశారు. నూతనంగా బార్ కౌన్సిల్‌లో నమోదైన జూనియర్ న్యాయవాదులకు హెల్త్ కార్డులు మంజూరుచేయాలని, గతంలో హెల్త్ కార్డు కలిగిన న్యాయవాదులకు జిల్లా కేంద్రంలో మల్టీ స్పెషాలిటీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఏర్పాటు చేసేలా చూడాలని కోరగా, వినోద్‌కుమార్ సానుకూలంగా స్పందించారని దిలీప్‌చౌదరి తెలిపారు. న్యాయవాది మరణిస్తే ప్రస్తుతం బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఇస్తున్న రూ.4 లక్షలు కాకుండా అదనంగా ప్రభుత్వం తరఫున మరో రూ.4 లక్షలు ఇచ్చేందుకు కృషి చేస్తానని, న్యాయవాదుల సంక్షేమం కోసం మరో రూ.100 కోట్ల నిధులు కేటాయించేలా సీఎం కేసీఆర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు వివరించారు.

ఒకరిని కాపాడబోయి.. ఇద్దరు గల్లంతు..

నేలకొండపల్లి: కుటుంబ తగాదాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన వారిని కాపాడేందుకు వెళ్లి ఇద్దరు గల్లంతైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అప్పలనరసింహాపురం గ్రామంలో కర్లపూడి నాగరాజు – రమణ దంపతులు ఆదివారం రాత్రి ఘర్షణ పడ్డారు. రమణ పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి వెళ్లడంతో భయంతో భర్త నాగరాజు తన స్నేహితుడు యండ్రాతి జోజిని వెంట తీసుకుని వెళ్లాడు. బావి వద్దకు రాగానే రమణ బావిలో దూకింది. జోజికి ఈత రావటంతో బావిలోకి దూకి రమణను కాపాడాడు. ఈ క్రమంలో భయంతో భర్త నాగరాజు కూడా బావిలోకి దూకాడు. జోజి మళ్లీ బావిలోకి దూకి నాగరాజును కాపాడే క్రమంలో బావి లోతుగా ఉండటంతో ఇరువురు బావిలో గల్లంతయ్యారు. గ్రామస్తులు విషయం తెలుసుకుని పెద్ద సంఖ్యలో బావి వద్దకు చేరుకున్నారు. చాలామంది యువకులు బావిలోకి దిగి దాదాపు రెండు గంటల పాటు గాలించారు. చిమ్మచీకటిగా ఉండటంతో ఆచూకీ కనిపించలేదు. బావి వద్ద గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

మట్టి ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

మృతదేహంతో ధర్నా



బీఆర్‌ఎస్ నాయకుడి ఇంటి ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

దమ్మపేట: మట్టి ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని మల్లారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన పూచి నాగరాజు (27) సొంత పనిమీద దమ్మపేట వచ్చి తిరిగి స్వగ్రామం బయలుదేరాడు. మల్లారం గ్రామ శివారుకు రాగానే అతి వేగంగా మట్టితో వస్తున్న ట్రాక్టర్ నాగరాజుని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి బలమైన దెబ్బలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు ఘటనా స్థలానికి భారీగా చేరుకుని, మట్టి మాఫియాపై ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మృతుడి చావుకు అనుమతులు లేని మట్టి తోలకాలు, మట్టి మాఫియానే కారణమని పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తాటి వెంకటేశ్వర్లుతోపాటు సీపీఐ నాయకులు యార్లగడ్డ భాస్కరరావును అరెస్టు చేసి దమ్మపేట పోలీస్‌స్టేషన్‌కు, తరువాత అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనా స్థలం కనుంచి మృతదేహాన్ని పోలీసులు అంబులెన్స్‌లో ఎక్కించాలని ప్రయత్నించగా బంధువులు అడ్డుకొని సుమారు రెండు కిలోమీటర్ల దూరం చేతుల మీద మోసుకుంటూ దమ్మపేట మండల కేంద్రానికి తీసుకొచ్చారు. మట్టి మాఫియాకు మండల బీఆర్‌ఎస్ నాయకుడే కారణమని భావించిన మృతుడి బంధువులు సదరు నాయకుడి ఇంటి ముందు ధర్నాకు దిగారు. పోలీసులు ఎంతనచ్చజెప్పినా వినలేదు. మధ్యవర్తుల ప్రమేయంతో మృతుడి కుటుంబానికి కొంతమేర ఆర్థిక సహాయం చేస్తానని బీఆర్‌ఎస్ నాయకుడు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి



శేషమ్మ మృతదేహం

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి గ్రామ శివారులో ఓ వృద్ధురాలు వడదెబ్బతో మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన గొర్రెముచ్చు శేషమ్మ (80) మతిస్థిమితం లేనందున రెండ్రోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆదివారం గొల్లపూడి శివారులోని పంట పొలాల్లో శేషమ్మ విగతజీవిగా పడి ఉండడం గమనించిన రైతులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వడదెబ్బతో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె ఉంది.

తాటిచెట్టు పైనుంచి కిందపడి వ్యక్తి...

ములకలపల్లి: తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తూ కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పాతూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దుబ్బా వెంకటేశ్ (39) సుతారి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగానే శనివారం పనికివెళ్లిన వెంకటేశ్ సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చాడు. గ్రామ శివారులోని తాటిచెట్ల వద్దకు వెళ్లి, కల్లు సేకరించేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే ఆస్పత్రికి తరలించేలోగానే వెంకటేశ్ మృతి చెందాడు. ఆదివారం మృతుడి భార్య దుబ్బా వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ తిరుమల్‌రావు తెలిపారు.

క్లుప్తంగా...

వివేకా కేసులో ఐదో రోజూ కొనసాగిన విచారణ

- భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించిన సీబీఐ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా వరుసగా ఐదో రోజు కూడా సీబీఐ అధికారులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. వారిని ఆదివారం ఉదయం 9.15 గంటలకు హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు నుంచి కోఠిలోని సీబీఐ కార్యాలయానికి తీసుకువచ్చారు. సాయంత్రం 4.20 గంటలకల్లా విచారణను పూర్తి చేసి.. వారిద్దరినీ తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

పులివెందులలో సీబీఐ విచారణ

- పలు ప్రాంతాలను పరిశీలించిన దర్యాప్తు అధికారులు



వైఎస్ వివేకా ఇంటి వద్ద కంప్యూటర్ ఆపరేటర్ ఇనయతుల్లాతో సీబీఐ అధికారులు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఆదివారం సాయంత్రం సీబీఐ అధికారులు వైఎస్సార్ జిల్లా పులివెందులకు వచ్చారు. తొలుత వివేకా ఇంటి వద్దకు వెళ్లి.. బయటి నుంచే పరిసరాలను పరిశీలించారు. ఆ తర్వాత వైఎస్ భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లి.. అక్కడ ఉన్న పీఏ రమణారెడ్డితో మాట్లాడారు. అనంతరం మళ్లీ వివేకా ఇంటికి వచ్చి.. కంప్యూటర్ ఆపరేటర్ ఇనయతుల్లాను తమ వాహనంలో ఎక్కించుకుని కొద్దిసేపు అక్కడే విచారించారు. ఆ తర్వాత ఇనయతుల్లాను తీసుకొని మళ్లీ భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జమ్మలమడుగు ప్రచారానికి వెళుతూ ఘటన గురించి తెలిసిన వెంటనే తిరిగొచ్చిన స్థలాన్ని చూపించాలని పీఏ రమణారెడ్డిని సీబీఐ అధికారులు కోరారు. దీంతో రమణారెడ్డి రింగ్ రోడ్డులోని కృష్ణ టెంపుల్ సమీపంలో ఉన్న ప్రాంతాన్ని సీబీఐ అధికారులకు చూపించాడు. ఆ ప్రాంతాన్ని చూసిన అనంతరం సీబీఐ అధికారులు వివేకానందరెడ్డి ఇంటి లోపలికి వెళ్లి పరిశీలించారు. ఇనయతుల్లాను అక్కడే వదిలేసి కడపకు వెళ్లిపోయారు.

తప్పు ఒప్పుకున్నా ఇంకా సమర్థిస్తారా?

రామోజీ నిర్వాకాలపై నిలదీసిన న్యాయ కోవిదులు, ప్రముఖులు

- మార్గదర్శి అక్రమాలు–నిజానిజాలపై విజయవాడలో స్వర్ణాంధ్ర పత్రిక సదస్సు



సదస్సులో ప్రముఖులు, న్యాయ కోవిదులు



మాట్లాడుతున్న ఉండవల్లి

సాక్షి, అమరావతి: మార్గదర్శి సంస్థ వ్యవహారాల విషయంలో చట్టాన్ని ఉల్లంఘించినట్లు విచారణలో రామోజీరావే అంగీకరించాక కొందరు ఇంకా ఆయన్ను సమర్థించేందుకు ప్రయత్నించడం అసంబద్ధమని న్యాయ నిపుణులు స్పష్టం చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ చట్ట విరుద్ధంగా చందాదారుల సొమ్మును జాతీయ బ్యాంకుల్లో కాకుండా తమ అనుబంధ సంస్థలు, ఇతర చోట్ల పెట్టుబడిగా పెట్టినట్లు రామోజీనే అంగీకరించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈనాడు పత్రికను అడ్డం పెట్టుకుని మార్గదర్శి ఫైనాన్షియర్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో అక్రమాలకు పాల్పడుతుంటే చట్టం కళ్లు మూసుకుని చూస్తూ ఊరుకోదని తేల్చి చెబుతున్నారు. 'రామోజీరావు మార్గదర్శి అక్రమాలు – నిజానిజాలు' అనే అంశంపై ఆదివారం విజయవాడలో స్వర్ణాంధ్ర పత్రిక నిర్వహించిన సదస్సులో పలువురు ప్రముఖులు, న్యాయ కోవిదులు పాల్గొని మాట్లాడారు.

ఉపేక్షిస్తే మాఫియా సామ్రాజ్యమే: ఉండవల్లి

రామోజీరావు ఆగ్రహిస్తేనో, ఈనాడు పత్రికల్లో వ్యతిరేకంగా రాస్తేనో ఏదో జరిగిపోయే రోజులు పోయాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. గతంలో రాజమండ్రిలో తనను ఓడించేందుకు రామోజీ ఎంతో ప్రయత్నించినా తాను గెలిచానని గుర్తు చేశారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్ల కూడా ఈనాడు అలాగే వ్యవహరిస్తోందన్నారు. అయితే అప్పుడు జరిగిందే రేపు కూడా జరుగుతుందని వ్యాఖ్యానించారు. 'రామోజీరావు తాను చట్టాలను పట్టించుకోనంటారు. చట్టాలకు అతీతమన్నట్లుగా వ్యవహరిస్తారు. తనను ఎవరూ ప్రశ్నించడానికి వీల్లేదని వాదిస్తారు. తాను ఆర్థిక అక్రమాలకు పాల్పడినా అడగకూడదని వితండవాదం చేస్తారు. 60 ఏళ్లుగా తన అక్రమాలను ఎవరూ ప్రశ్నించలేదు కాబట్టి ఇప్పుడూ అడగడానికి వీల్లేదని చెబుతారు. రామోజీరావు లాంటి వారిని వదిలేస్తే దేశంలో అతిపెద్ద మాఫియా సామ్రాజ్యం తయారవుతుంది' అని ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.

నాడు మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్లు

'మార్గదర్శి ఫైనాన్సియర్స్ విషయంలోనూ 2006లో రామోజీరావు అడ్డగోలుగా వాదించారు. హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్) కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చన్న రామోజీ వాదనను ఆర్బీఐ సమ్మతించలేదు. ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. దీంతో తాము ప్రజల నుంచి రూ.2,600 కోట్లు డిపాజిట్లు సేకరించడం తప్పని రామోజీరావు ఆర్బీఐ వద్ద అంగీకరించారు. ఆ డిపాజిట్లను వెనక్కి ఇచ్చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. కానీ ఎవరెవరి నుంచి డిపాజిట్లు వసూలు చేశారో చెప్పమంటే వెల్లడించలేదు. ఆ డిపాజిట్‌దారుల వివరాలు తెలియచేయాలని ఇటీవలే సుప్రీం కోర్టు ఆదేశించింది.

హాయిగా మంచంపై పడుకుని..

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను నిర్వహిస్తున్న రామోజీరావు అసలు తాను కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని పట్టించుకోనని సీఐడీ విచారణలో వాదించడం బరితెగింపే. చిట్‌ఫండ్ సంస్థలు తమ చందాదారుల నుంచి వసూలు చేసే సొమ్మును జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాలని చట్టంలో ఉంది. కానీ ఆ నిధులను రామోజీరావు తన సొంత సంస్థల్లో పెట్టుబడిగా పెట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై రామోజీరావు, ఆయన కోడలిని విచారించేందుకు సీఐడీ అధికారులే వారి ఇంటికే వెళ్లాల్సి వచ్చింది. రామోజీరావు హాయిగా మంచంపై పడుకుని ఉంటే సీఐడీ అధికారులు ఏవో ప్రశ్నలు అడిగి వచ్చారు. దేశంలో ఇతరులకు అలా సాధ్యం అవుతుందా? పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తారు. రామోజీరావు కాబట్టి ఏదైనా చెల్లుతుంది.

అక్రమాలను ప్రశ్నిస్తే కక్షగట్టడమా?

మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రజల నుంచి రూ.2,600 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేస్తే రామోజీరావు గ్రూపు సంస్థలు రూ.1,850 కోట్లు నష్టం చూపించాయి. మరి రామోజీరావు బోర్డు తిప్పేస్తే డిపాజిట్‌దారుల పరిస్థితి ఏమిటని నేను అడగడం తప్పా? మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అక్రమాలను నేను ప్రశ్నిస్తే రామోజీపై కక్ష గట్టానని కొందరు ఆడిటర్లు, న్యాయవాదులు వాదిస్తుండటం విడ్డూరం. రామోజీరావుకు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు అసలు సంబంధం లేదంటూ రాజాజీ అనే వ్యక్తితో నాపై పరువునష్టం దావా వేయించారు. అప్పుడు ఈ ఆడిటర్లు, లాయర్లు ఒక్కరైనా మాట్లాడారా?

బాబు – రామోజీ క్విడ్ ప్రోకో

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినా సరే అన్ని పార్టీలు రామోజీరావును కీర్తిస్తూ పోటీలు పడి మరీ ప్రకటనలు ఇస్తున్నాయి. చంద్రబాబు – రామోజీరావుకు మధ్య క్విడ్ ప్రోకో ఉంది. తన మాట వినలేదు కాబట్టే ఎన్టీఆర్‌ను ఈనాడు దించేసింది. ప్రస్తుతం చంద్రబాబు రామోజీ చెప్పినట్లే నడుస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్న వారంతా పోటీలు పడి మరీ రామోజీని సమర్థిస్తూ మాట్లాడుతున్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం జగన్ స్పందించారు

ఏపీ విభజన చట్టమే తప్పు. రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నేను సుప్రీంకోర్టులో కేసు వేశా. దానిపై ఏపీ ప్రభుత్వం తరఫున ఇంప్లీడ్ కావాలని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఆయన్ను కలసి మరీ అభ్యర్థిస్తే పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కావాలని ఓ ప్రెస్‌మీట్‌లో కోరా. వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ కేసులో ఇంప్లీడ్ అవుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం వైఎస్ జగన్ స్పందించారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమాల కేసులో సుప్రీంకోర్టులో నేను వేసిన కేసులో ఏపీ ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యింది. టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఇంప్లీడ్ కాలేదు. ఎక్కడ కేసీఆర్ ప్రభుత్వం ఇంప్లీడ్ అవుతుందో అనే భయంతో రామోజీరావు ఈనాడులో టీఆర్ఎస్‌కు భజన చేస్తున్నారు. సచివాలయాన్ని నిర్మిస్తే మయసభ నిర్మించినట్టుగా పెద్ద పెద్ద వార్తలు వేసి కేసీఆర్‌ను ఖుషీ చేయడానికి ప్రయత్నించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సక్రమంగా వ్యవహరిస్తోంది. మార్గదర్శి అక్రమాల కేసును సమగ్రంగా విచారించి సరైన పరిష్కారం చూపించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉంది.

టీడీపీతో చర్చకు సిద్ధంగా ఉన్నా

చంద్రబాబు, మార్గదర్శి వ్యవహారాలపై చర్చకు నేను సిద్ధంగా ఉన్నా. టీడీపీ అధికార ప్రతినిధి హోదాలో చంద్రబాబు ఎవరినైనా చర్చకు పంపాలి. సింగపూర్, దుబాయిలో చంద్రబాబు ఆస్తులు లాంటి కష్టమైన ప్రశ్నలు ఏవీ నేను అడగను. టీడీపీ ప్రభుత్వంలో వ్యవహారాలపైనే అడుగుతా. అని మాజీ ఎంపీ ఉండవల్లి అన్నారు.

చట్టాన్ని ఉల్లంఘించామని అంగీకరించిన రామోజీ

మార్గదర్శి సంస్థ వ్యవహారాల విషయంలో చట్టాన్ని ఉల్లంఘించినట్టు రామోజీరావే అంగీకరించాక ఆయన తప్పు చేయలేదని ఇతరులు ఎవరో మాట్లాడటం అసంబద్ధమని సుప్రీంకోర్టు న్యాయవాది ఎస్. సత్యనారాయణ ప్రసాద్ పేర్కొన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ చట్టాన్ని ఉల్లంఘించి చందాదారుల సొమ్మును జాతీయ బ్యాంకుల్లో కాకుండా ఇతర సంస్థల్లో పెట్టుబడి పెట్టినట్టు రామోజీరావే అంగీకరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు సెక్షన్ 160 కింద నోటీసులు ఇవ్వడాన్ని కొందరు ఆడిటర్లు, న్యాయవాదులు ప్రశ్నించడం సరికాదని సుప్రీంకోర్టు న్యాయవాది ఎస్.సత్యన్నారాయణ ప్రసాద్ స్పష్టం చేశారు. తమకు ఎవిడెన్స్ చట్టం 126 కింద మాత్రమే నోటీసులు ఇవ్వాలన్న వారి వాదన పూర్తిగా సత్యదూరమన్నారు. సెక్షన్ 126 అన్నది కేవలం ఒక అర్జీదారు, అతడి న్యాయవాదికి సంబంధించిన వ్యవహారాలకే వర్తిస్తుందన్నారు. కేసు అంశాలపై మాట్లాడినవారికి సెక్షన్ 160 కింద నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అధికారం దర్యాప్తు సంస్థలకు ఉంటుందని సోదాహరణంగా వివరించారు. ఈనాడు పత్రికను అడ్డం పెట్టుకుని మార్గదర్శి ఫైనాన్షియర్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలకు పాల్పడతామంటే ఎలా? అని సదస్సు నిర్వాహకుడు, ప్రముఖ పాత్రికేయుడు కేజీబీ తిలక్ ప్రశ్నించారు. చట్టాలు సక్రమంగా అమలయ్యేలా వాచ్‌డాగ్‌గా ఉండాల్సిన మీడియా కొందరి పెంపుడు కుక్కగా మారుతుండటం విషాదకరమన్నారు. సమాచార హక్కు చట్టం పూర్వపు కమిషన్ అంబటి సుబ్బారావు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పూర్వ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డితోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సదస్సుకు హాజరయ్యారు.

ఇళ్ల నిర్మాణంలో ఏపీ భేష్

- పేదల ఇళ్ల కోసం ఏకంగా 68,677 ఎకరాలు పంపిణీ
- దేశంలో ఇంత పెద్ద ఎత్తున మరే రాష్ట్రంలోనూ ఇళ్ల స్థలాలివ్వలేదు
- కేంద్ర హౌసింగ్ – పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రశంసలు

సాక్షి, అమరావతి : పేదలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని కేంద్ర గృహ నిర్మాణ–పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 30 లక్షల మందికిపైగా పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ భూములను సేకరించి.. ఏకంగా 68,677 ఎకరాలు పంపిణీ చేసిందని కొనియాడింది. ఇళ్ల స్థలాల పట్టాలన్నీ మహిళల పేరుపై మంజూరు చేయడం ద్వారా వారి సాధికారతకు తోడ్పడుతోందని మెచ్చుకుంది. దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లోనూ ఇంత పెద్ద ఎత్తున పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ జరగలేదని, వారందరికీ ఇళ్ల నిర్మాణం కోసం కొత్తగా ఏకంగా 17,005 జగనన్న కాలనీలను నిర్మిస్తోందని వివరించింది. దేశంలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లో 'సరసమైన గృహాలు – ఉత్తమ పద్ధతులు' అంశంపై అధ్యయనం చేసిన కేంద్ర గృహ నిర్మాణ – పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. ఇటీవల నివేదికను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అనుసంధానం చేసి, లబ్ధిదారులకు ప్రయోజనాలు అందిస్తోందని ఆ నివేదికలో పేర్కొంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనతో గృహాలకు ఎల్‌పీజీని, ప్రధానమంత్రి సహజ బిజిలీ హర్ ఘర్ యోజన కింద విద్యుత్, జలజీవన్ మిషన్ కింద తాగునీరు, జన్ ధన్ యోజన కింద బ్యాంకు ఖాతాలు ప్రారంభించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అండగా నిలిచిందని వెల్లడించింది. వీటితో పాటు మహిళా సాధికారతలో భాగంగా అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా ఆర్థిక సాయం చేస్తూ.. పిల్లలను చదివించేందుకు తల్లులకు అధికారం కల్పించే పథకాన్ని అమలు చేస్తోందని కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది.

తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ ఓ వరం

- కేన్సర్ నియంత్రణకు చర్యలు.. చికిత్సకు రూ.800 కోట్లు ఖర్చు
- రూ.2 కోట్లతో కార్మిక భవన్: హరీశ్



దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు అందజేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్/హుస్నాబాద్: ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హెల్త్ ప్రొఫైల్ వరం లాంటిదని, నిర్ధారణ పరీక్షల ద్వారా ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించే అవకాశం ఉంటుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆదివారం డే కేర్ కీమోథెరపీ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ...రాష్ట్రంలో మొట్టమొదటి డే కేర్ కీమోథెరపీ సెంటర్‌ను సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రారంభించుకున్నామని, ఖమ్మం, కరీంనగర్, సిరిసిల్ల, వనపర్తిలో థెరపీ యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలో ఎనిమిది వైద్య కళాశాలల్లో, అనంతరం 33 జిల్లాల్లో యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

50మందికి ట్రై మోటార్ సైకిళ్లు...

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని మంత్రి హరీశ్‌రావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో 50 మంది దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు పంపిణీ చేశారు. సిద్దిపేటలో కార్మిక దినోత్సవం రోజున రూ.3కోట్లతో కార్మిక భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాల్లో ఆయన పాల్గొన్న హరీశ్‌రావు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో 1,002 రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పామని, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టారని తెలిపారు.

జిల్లా వార్తలు

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.45, 920



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం సందడి నెలకొంది. జిల్లాతో పాటు పొరుగు జిల్లాల సైతం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించి బోట్‌షికారు చేశారు. 817 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.27,230 ఆదాయం రాగా, 350 మంది బోటింగ్ చేయడం ద్వారా టూరిజం శాఖకు రూ.18,690 ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

తెనాలిలో ఖమ్మం కవుల కవితా పఠనం



కవి సమ్మేళనానికి హాజరైన ఖమ్మం కవులు

ఖమ్మంగాంధీచౌక్: ఏపీలోని తెనాలిలో జాషువా కళా పరిషత్ 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ఖమ్మానికి చెందిన పలువురు కవులు పాల్గొని కవితా పఠనం చేశారు. ఖమ్మం వికాస వేదిక వ్యవస్థాపక కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్ 'నిజాలిప్పుడు నిలువునా పాతరేయ బడుతున్నాయి' కవితను వినిపించారు. ఇంకా కవులు తిరునగరి శ్రీనివాసరావు, గరిడేపల్లి శోభనాద్రి, మందుల వీరభద్రం, గుమ్మడి పుల్లయ్య, నల్ల కృష్ణమూర్తి, యడవల్లి శైలజ, సంధ్య, సునీత, చిలకబత్తిన వీరబాబు కూడా పలు కవితలను వినిపించి నిర్వాహకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

అందుబాటులో ఆధునిక వైద్యం

- ఖమ్మం పెద్దాస్పత్రిలో అత్యాధునిక చికిత్స
- రేడియాలజీ విభాగంతో అందుబాటులోకి..
- కీమోథెరపీకి ప్రత్యేక వార్డు సిద్ధం
- త్వరలో మోకీలు శస్త్ర చికిత్సలు కూడా



ప్రారంభానికి సిద్ధమైన రేడియాలజీ విభాగం (ఇన్‌సెట్) కంటి విభాగానికి కేటాయించిన ఫాకో మిషన్



ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి జిల్లా వాసులే కాకుండా భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ సూర్యాపేటతో పాటు సరిహద్దున ఉన్న ఏపీలోని జిల్లాల నుంచి కూడా పేదలు వైద్యం కోసం వస్తుంటారు. ఈ నేపథ్యాన ఆస్పత్రిలో ఇప్పటికే మెరుగైన చికిత్స అందుతుండగా.. మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇటీవల ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తూ అనుమతి రావడంతో త్వరలోనే అత్యాధునిక వైద్యసేవలు మొదలుకానున్నాయి. ప్రముఖ నగరాల్లో మాత్రమే అందే ఖరీదైన వైద్యసేవలు కూడా ఖమ్మం ఆస్పత్రిలో పేదలకు అందనున్నాయి. త్వరలోనే రేడియాలజీ విభాగం, కీమోథెరపీ విభాగం, మోకాలు శస్త్ర చికిత్స వంటి సేవలు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే పనులు తుదిదశకు చేరగా కొద్దిరోజుల్లో ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. తద్వారా హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పని లేకుండా ఉచితంగానే అత్యాధునిక సేవలు మొదలుకానుండడం విశేషం.

సిద్ధమైన రేడియాలజీ భవనం

ఆస్పత్రి ఆవరణలో గత ఏడాది ఏప్రిల్‌లో రేడియాలజీ భవనానికి శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.72 లక్షలు కేటాయించగా టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఆధ్వర్యాన భవన నిర్మాణం చేపట్టారు. ఈ భవనం పూర్తికాగా.. త్వరలోనే రేడియాలజీ భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే సీటీ స్కాన్, అల్ట్రా సౌండ్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే, 2డీ ఎకో, ఈసీజీ సేవలు మొదలవుతాయి. అత్యవసర సేవలన్నీ ఒకేచోట ఉండటంతో సమయం ఆదా అవడమే కాక నాణ్యమైన సేవలందుతాయి. రేడియాలజీ విభాగంలో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని.. తద్వారా రాత్రి వేళ జరిగే ప్రమాదాల్లో బాధితులకు సత్వరమే చికిత్స అందుతుందని చెబుతున్నారు.

కేన్సర్ వ్యాధికి ప్రత్యేక విభాగం

కేన్సర్ వ్యాధికి ప్రభుత్వపరంగా జిల్లాలో చికిత్స అందుబాటులో లేదు. అత్యంత వ్యయంతో కూడుకున్నది కావడంతో సామాన్యులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో కొనసాగుతున్న పాలియేటీవ్ కేర్ యూనిట్‌ను ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కేన్సర్‌తో బాధపడుతూ చివరి దశకు చేరిన వారికి నామమాత్ర ఉపశమనం కోసమే ఇక్కడ వైద్యసేవలు అందేవి. కానీ ఇప్పుడు కేన్సర్ చికిత్స కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడంతో కీమోథెరపీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఐదు బెడ్లతో కూడిన ఐసీయూ త్వరలో అందుబాటులోకి రానుంది.

కంటి చికిత్సకు ఆధునిక యంత్రం

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి శస్త్రచికిత్సలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇంత వరకు వైద్యులు మాన్యువల్‌గా శస్త్రచికిత్సలు నిర్వహించేవారు. కానీ కంటివెలుగు ద్వారా ఆపరేషన్లు అవసరమని గుర్తిస్తుండగా.. వారికి ఇక్కడే మెరుగైన చికిత్స అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం ఫాకో మిషన్‌ను మంజూరు చేసింది. రూ.20లక్షల విలువైన ఈ యంత్రం ఇప్పటికే ఆస్పత్రికి చేరిన నేపథ్యాన ఇకపై క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించనున్నారు. దీంతో కంటి సమస్యలతో బాధపడే వారు మెరుగైన సేవలు పొందే అవకాశం కలిగింది.

ఇకపై మోకీలు శస్త్రచికిత్సలు ఇక్కడే..

ఇటీవల 40 ఏళ్లు దాటిన వారికి మోకీలు సమస్యలు ఎక్కువయ్యాయి. అయితే, జిల్లాలో అంతగా వైద్యసేవలు అందుబాటులో లేక హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వం ఖమ్మం ఆస్పత్రిలో మోకీలు శస్త్ర చికిత్స నిర్వహించేందుకు అనుమతి వచ్చింది. దీంతో రూ.20 లక్షల వ్యయంతో అత్యాధునికమైన ఆపరేషన్ థియేటర్ సిద్ధం చేశారు. ఇప్పటి వరకు జనరల్ ఆస్పత్రిలో ఒకే ఆపరేషన్ థియేటర్‌లోనే అన్ని ఆపరేషన్లు చేస్తున్నారు. కానీ మోకీలు ఆపరేషన్ అత్యంత జాగ్రత్తగా, ఇన్‌ఫెక్షన్ సోకకుండా చేయాల్సి ఉన్న నేపథ్యాన ప్రత్యేక థియేటర్ సిద్ధం చేశారు. సాధారణంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ శస్త్రచికిత్సకు రూ.1.5 లక్షల నుండి రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని.. ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు మొదలైతే పేదల ఇక్కట్లు తొలగిపోతాయి.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

రీజియన్‌లో 39 కేంద్రాల్లో నిర్వహణ



ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023 – 24 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 39 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 13,009 మంది విద్యార్థులకు గాను 11,799 మంది హాజరయ్యారని, 1,210 మంది గైర్హాజరయ్యారని రీజియన్ కోఆర్డినేటర్ ప్రత్యూష తెలిపారు. ఖమ్మం జిల్లాలో 17 పరీక్ష కేంద్రాల్లో 5,711 మంది విద్యార్థులకు గాను 5,330 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 381 మంది గైర్హాజరయ్యారు. భద్రాద్రి జిల్లాలో 12 కేంద్రాల్లో 4,134 మంది విద్యార్థులకు గాను 3,555 మంది హాజరు కాగా.. 579 మంది గైర్హాజరయ్యారు. మహబూబాబాద్ జిల్లాలో 10 కేంద్రాల్లో 3,164 మందికి గాను 2,914 మంది విద్యార్థులు హాజరు కాగా.. 250 మంది గైర్హాజరయ్యారు.

రేపటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలు
- పదికి 1,713, ఇంటర్మీడియట్‌కు 2,364 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఖమ్మం సహకారనగర్ : ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 25(రేపటి)నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మొత్తంగా 4077 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ఖమ్మంలో 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా పదో తరగతి పరీక్షలకు 4 కేంద్రాల్లో 817 మంది, ఇంటర్మీడియట్‌కు 6 కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,278 మంది.. మొత్తంగా 2,095 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 9 పరీక్ష కేంద్రాల్లో 1982 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనుండగా.. పదో తరగతి 4 కేంద్రాల్లో 896 మంది, ఇంటర్మీడియట్ 5 కేంద్రాల్లో 1086 మంది.. మొత్తం 1982 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

పకడ్బందీగా పరీక్షలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెగ్యులర్ పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించిన విధంగానే ఓపెన్ స్కూల్ పరీక్షలను నిర్వహించనున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మధుసూధన్ సమక్షంలో వివిధ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి .. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. విద్యా, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 25 నుంచి మే 4 వరకు పరీక్షలు జరగనున్నాయి.


అర్ధగంట ముందు నుంచే అనుమతి..

పదో తరగతికి ఉదయం, ఇంటర్మీడియట్‌కు మధ్యాహ్నం సమయంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించన్నారు. మధ్యాహ్నం పరీక్ష 2 : 30 నుంచి 5 : 30 గంటల వరకు నిర్వహించనుండగా.. ఈ రెండు షిఫ్టుల్లోనూ అరగంట ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు.

ఖమ్మం, కొత్తగూడెంలో కేంద్రాలివే..

జిల్లా కేంద్రమైన ఖమ్మం, కొత్తగూడెంలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఖమ్మంలో 1, కొత్తగూడెంలో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేయగా.. ఇందులో విద్యాశాఖ నుంచి ఒకరు, పోలీస్ నుంచి 1, రెవెన్యూ నుంచి ఒకరు ఉన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు విధులు నిర్వహించనున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగానే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటంతోపాటు తాగునీటి సౌకర్యాన్ని సైతం కల్పిస్తున్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం



జిల్లాలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం.రెగ్యులర్ పరీక్షల మాదిరిగానే ఓపెన్ పరీక్షలనూ నిర్వహిస్తాం. ఇప్పటికే ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు పటిష్టమైన చర్యలు చేపట్టాం. జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని సైతం నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చూస్తున్నాం.

– ఈ.సోమశేఖర శర్మ, డీఈఓ

బీజేపీని ఓడించడమే లక్ష్యం

- అందుకు కలిసొచ్చే పార్టీలతో ముందుకు సాగుతాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

నేలకొండపల్లి : బీజేపీని ఓడించడమే ప్రస్తుతం తమ ముందున్న లక్ష్యమని, ఇందుకోసం కలిసొచ్చే పార్టీలతో కలిసి ముందుకు సాగుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంలో ఆదివారం నిర్వహించిన పార్టీ జోనల్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాద బీజేపీని తెలంగాణలో అడుగు పెట్టనీయమని అన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులకు పూర్వ వైభవం రావడం ఖాయమని చెప్పారు. రైతులు, కార్మికులు కష్టజీవులు తరఫున పోరాడుతూ.. సమసమాజ స్థాపన కోసం నిత్యం కృషి చేసేది కమ్యూనిస్టులేనని తెలిపారు. ముజ్జుగూడెంలో ఎర్రజెండా యాత్ర ప్రారంభమైందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు నూతనంగా ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు.

సమావేశంలో మాజీ ఎంపీపీ సిరికొండ ఉమామహేశ్వరి, పాలేరు ఇన్‌చార్జ్ బండి రమేష్, నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, పిట్టల రవి, మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, ఏటుకూరి రామారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, మారుతి కొండలరావు, దండా సూర్యానారాయణ, ఉండమోదుగుల జనార్ధన్ రావు, సిరికొండ నాగేశ్వరరావు, దండా సత్యనారాయణ పాల్గొన్నారు.